## క్లుప్తంగా

### ఘనంగా నారాయణుడి కల్యాణోత్సవం



ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న భక్తులు

**పెద్దపప్పూరు:** మండలంలోని చిన్నపప్పూరు సమీపంలో పెన్నానది ఒడ్డున వెలసిన అశ్వత్థం క్షేత్రంలో శనివారం శ్రావణ మాసం పౌర్ణమి సందర్భంగా అర్చకులు స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉత్సవమూర్తులను అర్చకులు బాలసుబ్రమణ్య శర్మ, సుధీర్‌కుమార్‌శర్మ, సునీల్‌కుమార్‌శర్మ పట్టువస్త్రాలతో ప్రత్యేకంగా అలంకరించి స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. అనంతరం ఉత్సవమూర్తులను ఆలయం చుట్టూ పల్లకీలో భజన కీర్తనలు వల్లిస్తూ ఊరేగించారు. భక్తులకు ఈఓ సుబ్రమణ్యం సౌకర్యాలు కల్పించారు.

### పంచాయతీ రాజ్ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులు

**గుత్తి రూరల్:** గుత్తి తాలూకా పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు, పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎన్నికలు నిర్వహించారు. పంచాయతీరాజ్ మినిస్టీరియల్ గుత్తి తాలూకా యూనిట్ అధ్యక్షుడిగా పెద్దవడుగూరు ఎంపీడీఓ కార్యాలయ టైపిస్ట్ బి.శివప్రసాద్, ఉపాధ్యక్షుడిగా పెద్దవడుగూరు జెడ్పీహెచ్ఎస్ రికార్డు అసిస్టెంట్ రామ్మోహన్, జనరల్ సెక్రటరీగా ఎ.ఎస్.హరినాథ్, సంయుక్త కార్యదర్శిగా ఎ.జయప్రద, కోశాధికారిగా సి.సుదర్శన్‌రెడ్డి, జిల్లా కౌన్సిలర్లుగా సి.మురళీధర్, డి.లక్ష్మీదేవి ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారిగా పట్టణంలోని కోట 8వ వార్డు ఎంపీపీ పాఠశాల హెచ్ఎం జి.శ్రీధర్‌గౌడ్ వ్యవహరించారు. నూతనంగా ఎన్నుకున్న కార్యవర్గ సభ్యులను ఉద్యోగులు పూలమాలలు, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

### కొత్త వ్యక్తులొస్తే సమాచారమివ్వండి



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

**యల్లనూరు:** కొత్త వ్యక్తులు ఎవ్వరైనా గ్రామాల్లో కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం మండలంలోని కూచివారిపల్లి, బుక్కాపురం, కొడవండ్లపల్లి, తిమ్మంపల్లి గ్రామాల్లో ఆయన పర్యటించి ప్రజలకు చైన్ స్నాచింగ్‌లపై జరుగుతున్న తీరుపై వివరించి అవగాహన కల్పించారు. శుక్రవారం పుట్లూరు మండలంలోని కోమటికుంట్ల గ్రామంలో ఓ వివాహిత మెడలోని మూడు తులాల బంగారు గొలుసును దుండగులు ఎత్తుకెళ్లిన విషయం తెలిసిందే. గ్రామాల్లో మహిళలు తెల్లవారుజామున ముగ్గులు వేస్తున్న సమయంలో, సాయంత్రం వాకింగ్ చేసేటప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎవ్వరైనా కొత్త వ్యక్తులు కనిపించినా, అనుమానం రాగానే ఆయా పోలీస్‌స్టేషన్లకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో పుట్లూరు సీఐ సత్యబాబు, యల్లనూరు ఎస్‌ఐ రామాంజనేయ రెడ్డి పోలీసుసిబ్బంది పాల్గొన్నారు.

## తాగునీరు వృథా



కురుబ వీధిలో వృథా అవుతున్న తాగునీరు

**గుత్తి:** పట్టణంలోని కురుబ వీధిలో తాగునీరు వృథా అవుతోంది. వీధిలో పలు చోట్ల పైప్‌లైన్‌లు డ్యామేజయ్యాయి. దీంతో తాగునీరు డ్రైనేజీ కాలువల్లోకి వెళ్తోంది. కాలం చెల్లిన పైప్‌లైన్‌లు కావడం వల్ల తరచూ డ్యామేజీ, లీకేజీ అవుతున్నాయి. దీంతో నీరంతా వృథా అవుతోంది. ఫిర్యాదు చేసినా తాగునీటి పథకం సిబ్బంది పట్టించుకోలేదని ప్రజలు వాపోయారు. మున్సిపల్ అధికారులు తమకు ఏం సంబంధం లేదన్నట్లు ఉంటున్నారు. పైప్‌లైన్‌లకు మరమ్మతు చేపట్టి సమస్య పరిష్కరించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## నడిరోడ్డులో గొయ్యి



సుంకేసులపల్లి వద్ద రోడ్డు మార్గంలో కల్వర్టు వద్ద పడిన గొయ్యి

**పెద్దపప్పూరు:** మండలంలోని పసలూరు నుంచి సుంకేసుపల్లి వెళ్లే మార్గమధ్యంలో కల్వర్టు వద్ద పెద్ద గొయ్యి పడి ప్రమాదకరంగా మారింది. ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని వాహన చోదకులు, ప్రజలు వాపోయారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి కల్వర్టు వద్ద గొయ్యిని పూడ్చి వేసి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు చేపట్టాలని మండల ప్రజలు కోరారు.

## ఇలా ఉంటే రోగాలు రావా?



మదీనా కాలనీలో ఇళ్ల నడుమ అపరిశుభ్రత ఇలా ..

**పామిడి:** పామిడిలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. స్థానిక మదీనా తదితర కాలనీలో డ్రైనేజీ కాలువలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పైప్రాంతాల్లోని మురుగునీరంతా కాలువలు లేక లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్ల నడుమ నిలిచి మడుగులుగా మారుతున్నాయి. ఈ మురికి కూపాలు దోమలు, పందులకు అవాసాలుగా మారాయి. తద్వారా ప్రజలను రోగాలు వెంటాడుతున్నాయి. ఈ మురికి కూపాలు పసి పిల్లల ప్రాణాలకు యమపురి ద్వారాలుగా మారాయి. పాలకులు, అధికారులు స్పందించి డ్రైనేజీ కాలువలు నిర్మించి మురుగు సమస్యను పరిష్కరించి రోగాల బారి నుంచి కాపాడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

### ఎన్నికల ప్రచారంలో కేతిరెడ్డి పెద్దారెడ్డి



ఎన్నికలపై బైరెడ్డి సిద్ధార్థరెడ్డితో చర్చిస్తున్న కేతిరెడ్డి పెద్దారెడ్డి

**తాడిపత్రిటౌన్:** పులివెందులలో ఈ నెల 12న జరగబోయే జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి శనివారం తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు అవినాష్‌రెడ్డి, బైరెడ్డి సిద్ధార్థరెడ్డితో కలసి ఎన్నికలపై చర్చించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆయన వెంట తాడిపత్రి వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు



సోదరుడికి రాఖీ కడుతున్న యాడికి ఎంపీపీ బొంబాయి ఉమాదేవి



మాజీ ఎంపీ తలారి రంగయ్యకు రాఖీ కడుతున్న పేరం స్వర్ణలత



గుంతకల్లులోని అనురాగ వృద్ధాశ్రమంలో రాఖీ వేడుకలు చేసుకుంటున్న బ్రహ్మకుమారీలు

**గుంతకల్లు:** సోదర సోదరీమణుల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి (రక్షాబంధన్) వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. గుంతకల్లులోని ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయంలో రాఖీ పౌర్ణమి వేడుకలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బ్రహ్మకుమారీలు పార్వతి, గిరిజ తదితరుల నేతృత్వంలో అనురాగ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు రాఖీలు కట్టి స్వీట్లు పంచారు. అదేవిధంగా డీఆర్ఎం చంద్రశేఖర్‌గుప్తా, డీఎస్పీ ఆముదాల శ్రీనివాస్, ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ మేనేజర్ సురేష్‌కు బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

**తాడిపత్రిటౌన్:** తాడిపత్రి పట్టణంలో శనివారం అన్నా తమ్ముళ్లకు అక్కాచెల్లెళ్లు రాఖీలు కట్టి రక్షాబంధన్ వేడుకలు నిర్వహించుకున్నారు. తాడిపత్రి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి పేరం స్వర్ణలత అనంతపురం వెళ్లి మాజీ ఎంపీ తలారి రంగయ్యకు రాఖీ కట్టారు.

**పామిడి:** పట్టణంలో శనివారం రక్షాబంధన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకుని సోదరులకు సోదరీమణులకు రాఖీ కట్టారు.

**యాడికి:** మండలంలోని పలు గ్రామాల్లో శనివారం రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ఎంపీపీ బొంబాయి ఉమాదేవి తన సోదరుడు సతీష్‌నాయుడు ఇంటికి వెళ్లి రాఖీ కట్టారు. అలాగే బొంబాయి రమేష్‌నాయుడు, ఎంపీటీసీ వెంకటనాయుడికి వారి సోదరి లక్ష్మి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా కమలపాడులో వైస్ ఎంపీపీ చెన్నప్పకు వారి సోదరీమణులు భీమక్క, లక్ష్మీదేవి రాఖీ కట్టారు.

## ‘సూపర్ సిక్స్’ పేరుతో బాబు మోసం



యాడికి మండలం తూట్రాళ్లపల్లిలో కార్యక్రమం చేస్తున్న మండల కన్వీనర్ సంజీవరాయుడు, నాయకులు



యల్లనూరు మండలం వేములపల్లిలో కరపత్రాలను పంపిణీ చేస్తున్న మండల కన్వీనర్ శివశంకర్

**యాడికి:** సూపర్ సిక్స్ పథకాల పేరుతో చంద్రబాబు రాష్ట్ర ప్రజలను నిలువునా మోసగించారని వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజమెత్తారు. తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాల మేరకు శనివారం మండలంలోని తూట్రాళ్లపల్లిలో సర్పంచు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సంజీవరాయుడు, యాడికిలో సీనియర్ నాయకుడు బాలా రమేష్‌బాబు ‘బాబు ష్యూరిటీ –మోసం గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సంజీవరాయుడు, బాలా రమేష్ బాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా నిరుద్యోగ భృతి, ఆడబిడ్డ నిధి, బీసీలకు 50 సంవత్సరాలకే పింఛన్ పథ కాలు అమలుచేయలేదని దుయ్యబట్టారు. 20లక్షల మంది రైతులకు అన్నదాత సుఖీభవ సాయం ఎగ్గొట్టిన చరిత్ర సీఎం చంద్రబాబుదన్నారు. వంద శాతం హామీలను అమలు చేసి ప్రజల ఇంటి వద్దకు వెళ్లి చూపించిన ఘనత మాజీ ముఖ్య మంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుంద న్నారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, మాలిక్ హుస్సేన్, అహమ్మద్ హుస్సేన్, తిరుపాలు, ఆంజనేయులు, శివశంకర్, ఖాదర్ వలీ, ప్రసాద్, తూట్రాళ్లపల్లిలో తిరుపాలు, కేశవ రెడ్డి, శేఖర్, ముత్యాద్రి, ముత్యాలరెడ్డి, నారాయణ, శ్రీనివాస రెడ్డి, గురప్ప,వెంకటేస్, రామాంజనేయులు, సంజీవరాయుడు తదితరులు పాల్గొన్నారు.

### చంద్రబాబు మాటలను నమ్మొద్దు

**యల్లనూరు:** సీఎం చంద్రబాబు మాయమాటలను ప్రజలు నమ్మొద్దని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు శివశంకర్ సూచించారు. మండలంలో రెండోరోజు వేములపల్లి, మేడికుర్తి, నిట్టూరు, పెద్దమల్లేపల్లి, పీయం కొండాపురం, తిరుమలాపురం గ్రామాల్లో శనివారం చంద్రబాబు రీకాలింగ్ మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ఎన్నికల్లో ప్రజలు చంద్రబాబు మాయమాటలను నమ్మి మోసపోయారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు విష్ణునారాయణ, యోగానందరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, రామ్మోహన్, రవిచంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, గంగిరెడ్డి, కేశవరెడ్డి, వనం రవి, నాగరంగయ్య, నాగేశ్వరరెడ్డి, కృష్ణారెడ్డి, సూరి, మనోహర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

### రేపు ‘రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో’

**శింగనమల:** మండల కేంద్రంలో ఈ నెల 11న రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పూల ప్రసాద్ శనివారం తెలిపారు. కార్యక్రమానికి నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్, జిల్లా నాయకులు హాజరవుతారన్నారు. ఎంపీపీ, వైస్ ఎంపీపీలు, జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, వివిధ విభాగాల పార్టీ నాయకులు హాజరు కావాలని ఆయన కోరారు.

### నెట్టికంటుడి పాదాలకు పూజలు



కలశాన్ని ఊరేగిస్తున్న గ్రామస్తులు

**గుంతకల్లు రూరల్:** శ్రావణమాసం మూడో శనివారం సందర్భంగా కసాపురం గ్రామ సమీపంలోని పెద్దబండ గుట్టలో వెలసిన నెట్టికంటుడి పాదాలకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సర్పంచ్ రాయల్ అనిత, మాజీ సర్పంచ్ తిక్కస్వామి, గ్రామ పెద్దలు ఆలయానికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అక్కడ నుంచి పల్లకీపై కలశాన్ని ఊరేగిస్తూ స్వామివారి పాదాలు వెలసిన పెద్దబండ గుట్ట వద్దకు చేరుకున్నారు. స్వామివారి పాదాలకు అభిషేకాలు, పూజలు నిర్వహించిన అనంతరం కలశంలో స్వామివారిని ఆవాహనం చేసుకుని ఊరేగింపుగా తిరిగి ఆలయానికి చేరుకున్నారు. కలశంలో ఆవాహనం చేసిన స్వామివారి జలాన్ని నెట్టికంటి ఆంజనేయస్వామి మూల విరాట్ ముందు ఉంచి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

## ప్రజాస్వామ్యానికి పాతరేశారు

- మోదీ ప్రభుత్వంపై సీపీఐ రామకృష్ణ ధ్వజం



మహాసభలో మాట్లాడుతున్న రామకృష్ణ

**గుంతకల్లు:** ఎన్నికల కమిషన్, కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కుమ్మక్కై ప్రజాస్వామ్యానికి పాతర వేస్తూ అధికారంలో వస్తున్నారని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే.రామకృష్ణ సంచలన వ్యాఖ్యలు చేశారు. శనివారం గుంతకల్లులోని పాత బస్టాండ్ ఆవరణలో సీపీఐ 14వ పట్టణ మహాసభల బహిరంగ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రామకృష్ణ మాట్లాడుతూ గతంలో ఓటర్లను ఓటు వేయకుండా చేసి.. రిగ్గింగ్ చేసుకునేవారు.. నేడు మోదీ ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ కలిసి దేశంలోని అన్ని నియోజకవర్గాల్లో లక్షలాది దొంగ ఓట్లు సృష్టించారని ఆరోపించారు. అంతేకాదు సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఇన్‌కంట్యాక్ ఇలా వ్యవస్థలన్నింటినీ చేతుల్లోకి తీసుకుని తమను వ్యతిరేకించేవారిని జైళ్లకు పంపడం, ఇబ్బందులకు గురిచేయడం వంటి చర్యలతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారన్నారు. 11 ఏళ్ల మోదీ పాలనలో దేశంలో ఎవరైనా బాగుపడ్డారంటే అది కార్పొరేట్ సంస్థలు మాత్రమేనన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జగదీష్ మాట్లాడుతూ గుంతకల్లును జిల్లా కేంద్రంగా అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు. రాగులపాడు లిఫ్ట్ ఇరుగేషన్ నుంచి పిల్లకాలువలు ఏర్పాటు చేసిని నియోజకవర్గంలోని అన్ని చెరువులకూ హంద్రీ- నీవా నీళ్లు ఇవ్వాలన్నారు. కసాపురం రైల్వే మోరీ విస్తరణ చేయడంతోపాటు ధర్మవరం గేట్ వద్ద ఆర్‌యూబీ, బళ్లారి గేట్ చౌరస్తాలో ఫ్లైఓవర్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు బి.గోవిందు, వీరభద్రస్వామి, మహేష్, గోపీనాథ్, జాన్సబాబు, రాము, ఎస్ఎండీ గౌస్, రామాంజినేయులు, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

### ఆలయంలో చోరీ

**కుందుర్పి:** మండలంలోని ఎర్రగుంట సమీపంలోని మారెమ్మ ఆలయంలో శుక్రవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దుండగులు ఆలయంలోకి చొరబడి ఐదు కిలోల వెండి, 4తులాల బంగారం, హుండీలోని రూ.30వేల నగదు ఎత్తుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులను త్వరలో పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

### కార్యసిద్ధి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు



గుత్తిలో కార్యసిద్ధి ఆంజనేయస్వామికి ఆకుపూజ చేసిన దృశ్యం

**గుత్తి:** పట్టణ శివారులోని గుత్తి–అనంతపురం గ్రామానికి వెళ్లే రహదారిలో ఉన్న కార్యసిద్ధి ఆంజనేయస్వామి దేవాలయంలో శనివారం పౌర్ణమిని పురస్కరించుకుని అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహిచంఆరు. గుత్తికి చెందిన ఏఎస్‌ఐ నాగమాణిక్యం, ఆయన సోదరుడు భరత్, స్నేహితుడు చిన్ని ఆధ్వర్యంలో పూజలు చేశారు. అనంతరం సుమారు రెండు వేల మందికి అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది.

### కమనీయం.. రంగనాథుని కల్యాణోత్సవం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

**గుత్తి రూరల్:** జక్కలచెరువు గ్రామంలోని బొలికొండ రంగనాథ స్వామి కల్యాణోత్సవం శనివారం కమనీయంగా సాగింది. ఏటా శ్రావణ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకొని గ్రామంలో నిర్వహించే కల్యాణోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. అర్చకుడు సతీష్, ఆలయ అర్చకులు పలుకూరి రవికుమార్, లిఖిల్, నవీన్, ఉదయ్, చేతన్‌లు వేకువ జాము నుంచి స్వామికి మహా మంగళహారతి, శాంతి హోమం , అభిషేక ం, కాగడ హారతి, సంప్రోక్షణ, హోమం తదితర ప్రత్యేక పూజలు చేశారు. వారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి గ్రామంలో ఊరేగించారు. అనంతరం ఆలయ ఆవరణలో శ్రీదేవి, భూదేవిలతో రంగనాథునికి అంగరంగ వైభవంగా కల్యాణం జరిపించారు. అర్చకులు వేద మంత్రాలతో కల్యాణం జరిపించగా భక్తులు అక్షింతలు వేసి స్వామి వారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ శోభ, సర్పంచ్ సుహాసిని, ఆలయ సిబ్బంది రామకృష్ణ, బాలుమోహన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

### మద్యం విక్రేతల అరెస్టు

**యాడికి:** మండలంలోని రాయలచెరువులో మద్యం విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. శనివారం రాయలచెరువు గ్రామంలో వల్లపు శ్రీనివాసులు 14 బాటిళ్లు, వల్లపు కుళ్లాయిస్వామి 10 మద్యం బాటిళ్లను విక్రయిస్తుండగా అందిన సమాచారం మేరకు రాయలచెరువుకు వెళ్లి నిందితులను అరెస్టు చేశామన్నారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

### ఇసుక టిప్పర్ పట్టివేత

**శింగనమల:** బిల్లులు లేకుండా ఇసుక తరలిస్తున్న ఒక టిప్పర్‌ను మండలంలోని నాయనపల్లిక్రాస్ వద్ద శింగనమల పోలీసులు పట్టుకున్నారు. శనివారం సాయంత్రం నాయనపల్లి క్రాస్‌లో పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఇసుక తరలిస్తున్న టిప్పర్‌ను పోలీసులు నిలిపి, రికార్డులను పరిశీలించారు. ఇసుక తరలింపునకు సంబంధించి ఎటువంటి బిల్లులు లేకపోవడంతో టిప్పర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఇసుకను వైఎస్సార్ జిల్లా నుంచి తీసుకువస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## భారీ వర్షానికి నీట మునిగిన పంటలు



గుత్తి మండలం బేతాపల్లి వద్ద నీట మునిగిన వేరుశనగ

**గుత్తి రూరల్/గుత్తి:** మండల వ్యాప్తంగా భారీ వర్షం కురవడంతో పలు పంటలు నీటమునిగాయి. శుక్రవారం రాత్రి నుంచి శనివారం ఉదయం వరకూ 19.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహసీల్దార్ పుణ్యవతి తెలిపారు. అర్ధరాత్రి నుంచి ప్రారంభమైన వర్షం ఉదయం వరకూ ఏకబిగినీ కురిసింది. బసినేపల్లి, లచ్చానుపల్లి, యంగన్నపల్లి, ఊటకల్లు, బేతాపల్లి గ్రామాల్లో వేరుశనగ, పత్తి, ఆముదం, కంది, మిరప పంటలు నీట మునిగాయి. వర్షానికి పొలాల్లో సుమారు అడుగులోతుకు పైగా నీళ్లు నిలబడ్డాయి. పంటలు నీట మునిగి భారీగా నష్టపోయామని, ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరారు. కర్నూలు జిల్లాలోని పలు గ్రామాల్లో భారీగా వర్షాలు కురవడంతో దిగువనున్న వంకల్లో వర్షం నీళ్లు ఉధృతంగా ప్రవహించాయి. బసినేపల్లి, లచ్చానుపల్లి గ్రామాల వద్ద పెద్ద వంక పొంగి రోడ్లపై నుంచి నీరు పారాయి. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. అయితే చాలా రోజులు తర్వాత భారీ వర్షం కురవడంతో రైతులు, కూలీలు సంతోషం వ్యక్తం చేశారు.

**పెద్దపప్పూరు:** మండలంలో శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం తెల్లవారుజామువరకు జోరుగా వర్షం కురిసింది. దీంతో కొట్టాలపల్లి, అత్తిరాలదిన్నె తదితర గ్రామాల్లో వంకలు పారాయి. ఇదే వర్షం నెలరోజుల క్రితం పడిఉంటే ఉపయోగంగా ఉండేదని పలువురు రైతులు అభిప్రాయం వ్యక్తం చేశారు.



గుత్తి మండలం బసినేపల్లి వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్ద వంక



గుత్తిలో భారీగా నిలిచిన వర్షపు నీరు



పెద్దపప్పూరు మండలం కొట్టాలపల్లి వద్ద పారుతున్న వంక

### వినాయక చవితికి అనుమతులు తప్పనిసరి



సీఐ పుల్లయ్య

**బుక్కరాయసముద్రం:** వినాయక చవితి పండుగ నిర్వహణకు అనుమతులు తప్పనిసరి అని బుక్కరాయసముద్రం సీఐ పుల్లయ్య సూచించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వినాయక మండపాలు ఏర్పాటు చేయాలనుకునే వారు ముందుగా కమిటీగా ఏర్పడి పోలీస్‌స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలన్నారు. వినాయక చందాల పేరుతో బలవంతపు వసూళ్లకు పాల్పడరాదన్నారు. మట్టితో చేసిన వినాయక విగ్రహాలనే వాడాలన్నారు. మండపాల వద్ద డీజేలు, సౌండ్ సిస్టంకు అనుమతి లేదన్నారు. ప్రశాంతంగా పండుగను చేసుకోవాలన్నారు. వినాయక నిమజ్జనం సమయంలో గుంపులు గుంపులుగా ఊరేగింపులు చేయరాదన్నారు. పోలీసుల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. మద్యం తాగి డ్యాన్స్‌లు, వీరంగం సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

### కళాకారుడికి సన్మానం



గుంటూరులో దేవరాజును సన్మానిస్తున్న దృశ్యం

**పామిడి:** పట్టణంలోని స్వరరాగ నాటక కళాసమితి ఉచిత శిక్షణాలయం వ్యవస్థాపక అధ్యక్షుడు, రాయలసీమ రత్నం ఎం.దేవరాజును గుంటూరు సమత–నమత నాటక గురుకులం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడంపై శనివారం ఆసమితి సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఆయన తన ఉచిత శిక్షణాలయం ద్వారా ఔత్సాహికులను ప్రోత్సహించడమే కాకుండా శ్రీకృష్ణ, శ్రీరామ, హరిశ్చంద్ర, కర్ణుడు వంటి పాత్రలకు ప్రాణం పోశారని కళా సమితి సభ్యుడు పుంజా కృష్ణారావుయాదవ్ అన్నారు. పల్నాటియుద్ధం పౌరాణిక నాటక రచయిత వరయూరి రామానుజసూరి 16వ వర్ధంతి సందర్భంగా గత శుక్రవారం గుంటూరు పట్టణంలోని కాకాని కళాక్షేత్ర వేదికపై దేవరాజును సన్మానించడం పామిడికే గర్వ కారణమన్నారు.